రక్షణ కరవు.. పచ్చదనం కనుమరుగు



పితాపురం కాలనీ గ్రీన్‌బెల్ట్ పార్కులోని వాకింగ్ ట్రాక్‌లో కనుమరుగైన పచ్చదనం

- కళావిహీనంగా గ్రీన్‌బెల్ట్ పార్కులు
- ఆహ్లాదం.. ఆరోగ్యానికి దూరంగా ప్రజలు
- నిర్వహణను గాలికి వదిలేసిన అధికారులు

మద్దిలపాలెం: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి, ఆహ్లాదానికి ఎంతో ప్రాధాన్యమిచ్చింది. ప్రజలు కాసేపు సేదతీరేలా, ఆరోగ్య పరిరక్షణకు వ్యాయామం చేసేలా తూర్పు నియోజకవర్గంలో జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న గ్రీన్‌బెల్ట్ ప్రాంతాన్ని ఆకర్షణీయ పార్కులుగా తీర్చిదిద్దింది. వాటిలో వాకింగ్ ట్రాక్‌లు, చిల్డ్రన్ ప్లే ఏరియా, ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రీన్‌బెల్ట్ పార్కుల నిర్వహణను గాలికి వదిలేసింది. దీంతో అవి కళావిహీనంగా తయారవడంతో పచ్చదనం కనుమరుగైంది. రక్షణగా ఏర్పాటు చేసిన ఫెన్సింగ్, గేట్లు ధ్వంసమయ్యాయి. కొన్నిచోట్ల అభివృద్ధి పనులు సగంలోనే నిలిచిపోయాయి.

పితాపురం కాలనీలో అస్తవ్యస్తంగా..

జీవీఎంసీ 22వ వార్డు పితాపురం కాలనీ సర్వీస్ రోడ్డుకు హైవేకు ఆనుకొని ఉన్న గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలో 300 మీటర్ల పొడవైన వాకింగ్ ట్రాక్, దానికి ఇరువైపులా, మధ్యలో మొక్కలు నాటి పచ్చదనం పెం పొందిం



సీఎంఆర్ సెంట్రల్ వద్ద గ్రీన్‌బెల్ట్ పార్కులో అంధకారం

చారు. పార్కుకు రక్షణగా చుట్టూ ఐరన్ ఫెన్సింగ్, ఒకవైపు గేటు ఏర్పాటు చేసి స్థానికులకు నిర్వహణ బాధ్యత అప్పగించారు. నిర్వహణ కొరవడంతో పార్కు కాస్తా అస్తవ్యస్తంగా మారింది. గ్రీన్‌బెల్ట్ పార్కులో వేసిన మొక్కలు మాయమయ్యాయి. పచ్చదనం హరించుకుపోయింది. ఫెన్సింగ్ కొంత భాగం ధ్వంసమైంది. పార్కులోని ప్రవేశ ద్వారంగా ఏర్పాటు చేసిన ఐరన్ గేటు ఊడిపోయింది.

గ్రీన్‌బెల్ట్ పార్కులను తీర్చిదిద్దాలి

గ్రీన్‌బెల్ట్ పార్కుల్లో లైట్లు ఏర్పాటు చేయాలని, ధ్వంసమైన పార్కు ఫెన్సింగ్, గేట్లను పునరుద్ధరించాలని, మొక్కలు నాటి ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేలా పార్కులను తీర్చిదిద్దాలని ఆయా ప్రాంతాలవాసులు కోరుతున్నారు.

అంధకారం.. ఆకతాయిలకు అడ్డా

మద్దిలపాలెం సీఎంఆర్ సెంట్రల్ వద్ద గ్రీన్‌బెల్ట్ పార్కును లక్షల రూపాయలు ఖర్చుపెట్టి అభివృద్ధి చేశారు. దానిలో విద్యుత్ దీపాల ఏర్పాటు మరిచారు. దీంతో చీకటి పడితే పార్కు ఆకతాయిలకు అడ్డాగా మారింది. మందుబాబులు, గంజాయి బ్యాచ్‌లు నిత్యం అక్కడ చేరి హల్‌చల్ చేస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పార్కులో లైట్లు లేక రాత్రి 8 గంటలు దాటాక మందుబాబులతో ఇబ్బంది పడుతున్నట్టు చెబుతున్నారు. వీరివల్ల మహిళలు, ఆడపిల్లలు అటుగా వెళ్లడానికి, ఇంటి బయట కూర్చోడానికి భయపడుతున్నారు. సత్యం సెంటర్‌లోని గ్రీన్‌బెల్ట్ పార్కులో విద్యుత్ లైట్లు లేకపోవడంతో రాత్రి వేళల్లో ఆకతాయిలతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు.

పేదల పక్షాన వైఎస్సార్‌సీపీ



పేదలకు పండ్లు, వస్త్రాలు అందిస్తున్న మేయర్ హరివెంకటకుమారి, జిల్లా ఉపాధ్యక్షుడు నడింపల్లి కృష్ణంరాజు

- మేయర్ గొలగాని హరివెంకటకుమారి
- ఘనంగా పార్టీ ఆవిర్భావ వేడుకలు

మద్దిలపాలెం: వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం బుధవారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. జీవీఎంసీ 15వ వార్డు సింహాద్రిపురంలో మాజీ కార్పొరేటర్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, వార్డు ఇన్‌చార్జి నడింపల్లి కృష్ణంరాజు ఆధ్వర్యంలో వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ముఖ్య అతిథి మేయర్ గొలగాని హరివెంకటకుమారి పార్టీ జెండాను ఆవిష్కరించారు. కేక్ కట్‌చేసి వృద్ధులు, పేదలకు పండ్లు, వస్త్రాలను నడింపల్లి కృష్ణంరాజుతో కలిసి ఆమె అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పేదల అభ్యున్నతి కోసమే వైఎస్సార్‌సీపీని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్థాపించారని తెలిపారు. పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు నవరత్నాల పథకాల ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ మహిళలకు ఎంతో లబ్ధి చేకూర్చరన్నారు.

జనం మెచ్చిన నేత వైఎస్ జగన్

నడింపల్లి కృష్ణంరాజు మాట్లాడుతూ పేదల పెన్నిధిగా వారి హృదయాల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న గొప్ప నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. 2029 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తుందని, జగన్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని జనం ఎదురు చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకుడు గొలగాని శ్రీనివాసరావు, వార్డు ఎస్సీ సెల్ అధ్యక్షులు కణితి మరియదాస్, మారడపూడి వేలంగిణి, అనకాపల్లి



వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ మువ్వల లక్ష్మి, పార్టీ శ్రేణులు

రాజేష్, మహిళా నాయకురాలు అనకాపల్లి రమణమ్మ, పెదిరెడ్ల నూకరాజు, భాస్కర్, అర్జీ వెంకటలక్ష్మి, కె.వెంకటరావు, బి.అచ్యుత, టి.మరియమ్మ, పెద్ద, రామకృష్ణ, పోలిరాజు, పల్లా శివ, అవినాష్, పెద్ద ఎత్తున కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

బీచ్‌రోడ్డు: వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మువ్వల సురేష్ ఆధ్వర్యంలో పెదవాల్తేరులో ఘనంగా నిర్వహించారు. అక్కడి వైఎస్సార్ విగ్రహానికి 20వ వార్డు కార్పొరేటర్ మువ్వల లక్ష్మి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండా ఆవిష్కరించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జి.వి.రామచంద్రరావు, రమణారెడ్డి, మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

త్వరలోనే ఆరిలోవ రైతుబజార్ ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..

ఆరిలోవ: ఆరిలోవ తోటగరువులో నిర్మించిన రైతు బజార్‌ను త్వరలో ప్రారంభిస్తామని జిల్లా మార్కెటింగ్, వ్యవసాయ శాఖాధికారి షేక్ యాసిన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇక్కడ రైతుబజార్ నిర్మాణం దాదాపు పూర్తయినా వినియోగంలోకి తీసుకురాకుండా వదిలేశారు. దీనిపై 'నిర్మించారు.. వదిలేశారు' అనే శీర్షికన 'సాక్షి'లో బుధవారం ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. రైతు బజార్ నిర్మాణంలో భాగంగా మిగిలిపోయిన చిన్నచిన్న పనులు జరుగుతున్నాయని ప్రకటనలో పేర్కొన్నారు. వీటిని త్వరగా పూర్తిచేసి వెంటనే రైతుబజార్‌ను ప్రారంభిస్తామన్నారు. ఆరిలోవ ప్రాంత ప్రజలకు ఇక్కడ కూరగాయలు, సరకులన్నీ అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు.

అవయవదానంపై అవగాహన నేడు

- విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు

ఆరిలోవ: అవయవదానంపై అందరూ అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర జీవన్‌దాన్ కోఆర్డినేటర్, విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్) డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరల్డ్ కిడ్నీ డే సందర్భంగా ఆంధ్రప్రదేశ్ జీవన్‌దాన్ ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులోని కాళీమాత ఆలయ ఆవరణలో గురువారం ఉదయం 6 గంటలకు అవయవదానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, పలువురు వైద్యాధికారులు పాల్గొని ప్రసంగించి, అవయవదానంపై అవగాహన కల్పిస్తారన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ప్రభుత్వ ఆధీనంలోనే వైద్య రంగం ఉండాలి

మద్దిలపాలెం: వైద్య రంగం ప్రభుత్వ ఆధీనంలోనే ఉండాలని, లేకుంటే ప్రజల ఆరోగ్యానికి రక్షణ ఉండదని పీసీసీ ప్రధాన కార్యదర్శి, ఓబీసీ డిపార్ట్‌మెంట్ ఇన్‌చార్జి మూల వెంకటరావు అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నెలకొల్పుతున్న నూతన వైద్య కళాశాలలకు ప్రైవేటు భాగస్వామ్యం(పీపీపీ) నమూనాను వర్తింపజేయడం.. ఇప్పటికే మినుకు మినుకుమంటున్న ప్రజారోగ్యాన్ని మరింత చీకటిమయం చేయడమేనన్నారు. రాష్ట్ర ప్రజలకు నాణ్యమైన వైద్య సదుపాయాలు అందుబాటులోకి రావాలంటే ప్రభుత్వ రంగంలో వైద్య విద్య సౌకర్యాలు పెరగాలని సూచించారు. ప్రైవేట్ కాలేజీల్లో సీట్లు కొనలేక వైద్య విద్యపై ఆసక్తి ఉన్న చాలా మంది ఔత్సాహిక యువత తమ ఆలోచనను విరమించుకుంటున్నారని పేర్కొన్నారు. కొత్తగా వచ్చే మెడికల్ కాలేజీలు ప్రభుత్వ రంగంలో నెలకొల్పుతారని విద్యార్థులు ఎంతగానో ఆశపడ్డారని, పీ–3 మోడల్ అని కూటమి ప్రభుత్వం ప్రకటించి వారి ఆశలను అడియాశలు చేసిందన్నారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి, వైద్య శాఖ మంత్రి మరోసారి పునరాలోచించాలని మూల వెంకటరావు అభ్యర్థించారు.

మత్తు పదార్థాల దుష్పరిణామాలపై విస్తృత ప్రచారం

విశాఖ విద్య: యువతను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచాలని ఆంధ్ర విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ అన్నారు. బుధవారం తన కార్యాలయంలో డ్రగ్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి, మాట్లాడారు. ఈ ప్రక్రియలో ఏయూ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ముఖ్య భూమిక పోషించాలని కోరారు. వలంటీర్లు సామాజిక స్పృహతో నడుచుకుంటూ ప్రజలకు మత్తు పదార్థాల దుష్పరిణామాలను విస్తృతంగా వివరించాలని, వారిలో చైతన్యం తీసుకురావాలని సూచించారు. ఆరోగ్యకరమైన జీవితాన్ని యువతరం అలవాటు చేసుకోవాలన్నారు. డ్రగ్స్‌కు అలవాటు పడితే భవిష్యత్తు, ఆరోగ్యం నాశనమవుతాయని తెలుసు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ రాజశేఖర్

కోవాలని హితవు పలికారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ల ద్వారా విస్తృత ప్రచారం కల్పించి యువతలో మంచి మార్పును తీసుకురావడానికి, ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించడానికి కృషి చేయాలని వీసీ సూచించారు.

ఏయూ బాల్ బ్యాడ్మింటన్ పురుషుల జట్టు ఎంపిక

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీ బాల్ బ్యాడ్మింటన్ పురుషుల జట్టును బుధవారం ఎంపిక చేసినట్లు ఏయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆచార్య ఎస్.విజయ్‌మోహన్ తెలిపారు. ఇంటర్ యూనివర్సిటీ బాల్ బ్యాడ్మింటన్ పోటీలు ఈ నెల 14 నుంచి 18 వరకు బెంగుళూరు సెంట్రల్ యూనివర్సిటీలో జరుగుతాయని చెప్పారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఆయన అభినందించారు. పోటీల్లో సత్తా చాటి, ఆంధ్రా యూనివర్సిటీకి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.



ఎంపికైన క్రీడాకారులతో ఏయూ ఆచార్యులు

మూలాలను అరికడితేనే మహిళలకు భద్రత

సీతంపేట: సోషల్ మీడియా ప్రభావం యువతపై చాలా ఎక్కువగా ఉందని గాయత్రి విద్యా పరిషత్ సైంటిస్ట్ డాక్టర్ శైలజ అన్నారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో బుధవారం ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ(పీడీఎస్‌వో) జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి అధ్యక్షతన 'చిన్నారులు, మహిళలపై అత్యాచారాలు – సామాజిక మూలాలు' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆమె ప్రసంగించారు. మనం వాడుతున్న యాప్స్‌లో వచ్చే యాడ్స్ న్యూడిటీని ఎక్స్‌పోజ్ చేస్తున్నాయన్నారు. 20 కిలోమీటర్ల పరిధిలో మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేయకూడదనే నిబంధన పెట్టారు కానీ, మద్యం షాపులను రెండు మూడు కిలోమీటర్ల దూరంలోనే ఏర్పాటు చేస్తూ యువతను మత్తులో ఉంచుతున్నారని విమర్శించారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాల గురించి ఆలోచించకుండా వాటిపై ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలతో సమాజంలో మార్పురాదని అభిప్రాయం



ప్రసంగిస్తున్న డాక్టర్ శైలజ

వ్యక్తం చేశారు. పీడీఎస్‌వో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.సురేష్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా జరుగుతున్న వరుస అత్యాచార సంఘటనలు తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయన్నారు. సంస్థ రాష్ట్ర కోశాధికారి ఎల్.భాను మాట్లాడుతూ రాష్ట్రంలో నిత్యం ఏదో ఒక రూపంలో మహిళలు, చిన్నారులపై లైంగిక దాడులు జరుగుతూనే ఉన్నాయని, దేశంలో గంటకు 47 ఘటనలు జరుగుతున్నాయని వివరించారు. ఇటువంటివి జరగకుండా మూలాలను అరికట్టాలన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆర్.ఆశా మాట్లాడుతూ మహిళలపై అత్యాచారాలకు, హత్యలకు కారణమవుతున్న మద్యం, మత్తుపదార్థాలు, పోర్న్ సైట్లను నిషేధించాలని డిమాండ్ చేసారు. సదస్సులో రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.భాస్కర్, జిల్లా అధ్యక్షుడు పి.విశ్వనాథ్ పాల్గొన్నారు.

త్రీ టౌన్ సీఐగా పైడయ్య బాధ్యతల స్వీకరణ

బీచ్‌రోడ్డు: మూడో పట్టణ పోలీస్ స్టేషన్ లా అండ్ ఆర్డర్ సీఐగా పి.పైడయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి సీఐ పి.రమణయ్య డిప్యూటేషన్‌పై విజిలెన్స్ విభాగానికి బదిలీ కావడంతో ఆయన స్థానంలో పైడయ్యను సీపీ నియమించారు. పైడయ్య ఇప్పటి వరకు సీఎస్‌బీలో సీఐగా విధులు నిర్వర్తించారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న సీఐ పైడయ్య

కిడ్నీ వ్యాధులపై అప్రమత్తం

ఎంవీపీకాలనీ: మూత్రపిండాల వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మెడికవర్ ఆస్పత్రి వైద్యుడు, నెఫ్రాలజిస్ట్ డాక్టర్ భీశెట్టి భాస్కరరావు ఒక ప్రకటనలో సూచించారు. ఇటీవల కాలంలో నిరంతరం అలసట, కాళ్లవాపు సమస్యలు ప్రజల్లో అధికమవుతున్నాయన్నారు. చాలా మందిలో ముందస్తు లక్షణాలు లేకున్నా, మధుమేహం లేకపోయినా కిడ్నీలు పనిచేయడం ఆగిపోతుందన్నారు. రానున్న రోజుల్లో ఈ సమస్య మరింత అధిగమవుతున్న నేపథ్యంలో ప్రజలంతా జాగ్రత్తగా ఉండాలన్నారు. కిడ్నీ వ్యాధుల లక్షణాలు ప్రారంభ దశలో గుర్తించడం కష్టమన్నారు. అలసట, కాళ్లవాపులు లక్షణాలు ఉంటే తక్షణమే స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. తగినంత తాగునీరు తాగడం, రక్తపోటు నియంత్రణలో ఉంచుకోవడం, పెయిన్ కిల్లర్స్ వాడకాన్ని తగ్గించడం, మధుమేహాన్ని నియంత్రణలో ఉంచుకోవడం, తరచూ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం ద్వారా మూత్రపిండాల వ్యాధుల నుంచి ఉపశమనం పొందవచ్చన్నారు.



డాక్టర్ భాస్కరరావు

బయోడైవర్సిటీ పార్కు సందర్శన



బయోడైవర్సిటీ పార్కులో విద్యార్థుల సందడి

బీచ్‌రోడ్డు: నగరానికి చెందిన ఒక ప్రైవేట్ స్కూల్ విద్యార్థులు బుధవారం పెదవాల్తేరులోని బయోడైవర్సిటీ పార్క్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా వారికి పార్క్ పర్యవేక్షకుడు రామామూర్తి వివిధ రకాల మొక్కల విశేషాలను వివరించారు. మొక్కల శాస్త్రీయ నామాలు, ఉపయోగాలు, పెరిగే వాతావరణం గురించి తెలియజేశారు. విద్యార్థులంతా పార్కులో సందడిగా గడిపారు.

బైక్ ర్యాలీగా 'యువత పోరు'కు..

బీచ్‌రోడ్డు: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ వద్ద నిర్వహించిన యువత పోరు కార్యక్రమానికి 28వ వార్డు నుంచి యువతీ యువకులు పెద్ద సంఖ్యలో బైక్ ర్యాలీగా వెళ్లి పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పల్లా దుర్గారావు నేతృత్వంలో నిర్వహించిన ఈ ర్యాలీ.. రామ్‌నగర్ నుంచి జిల్లా పరిషత్ వరకు సాగింది.



పల్లా దుర్గారావు నేతృత్వంలో బైక్ ర్యాలీగా వెళ్తున్న యువత

పోక్సో చట్టంపై అవగాహన

ఎంవీపీకాలనీ: సమత కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం, డిస్ట్రిక్ట్ లీగల్ సెల్ అథారిటీ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎంవీపీ కాలనీలోని కళాశాల ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ లీగల్ సెల్ అథారిటీ కార్యదర్శి, జిల్లా కోర్టు సివిల్ జడ్జి ఎం.వెంకట శేషమ్మ ముఖ్య అతిథిగా మాట్లాడారు. పోక్సో చట్టం–2012 పిల్లల సంరక్షణ కోసం రూపొందించిందన్నారు. బాలికలు ఎలాంటి లైంగిక వేధింపులు, దాడులకు గురైనా ఈ చట్టం సంరక్షిస్తుందని తెలిపారు. నిందితులను కఠినంగా శిక్షించడంలో కీలకపాత్ర పోషిస్తుందన్నారు. జిల్లా లీగల్ సర్వీసెస్ సేవల కోసం 15100 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. బాధితులకు సేవలు అందించేందుకు నిత్యం అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఆచార్య విజయ రవీంద్ర, డైరెక్టర్ ఆచార్య శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి వెంకట శేషమ్మ

ఎమ్మెల్యే శిరీషాదేవి రాజీనామాకు గిరిజన సంఘం డిమాండ్

ఎంవీపీకాలనీ: రంపచోడవరం నియోజకవర్గ ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి తన పదవికి తక్షణమే రాజీనామా చేయాలని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం డిమాండ్‌చేసింది. ఎంవీపీ కాలనీలోని గిరిజన భవన్‌లో బుధవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో సంఘ ప్రతినిధులు ఆమెపై మండిపడ్డారు. ఒక పక్క గిరిజన హక్కుల పరిరక్షణకు గిరిజన సంఘాలు కృషి చేస్తుంటే.. గిరిజనుల హక్కుల పరిరక్షణకు కవచంగా ఉన్న 1/70 చట్టాన్ని రద్దు చేయాలంటూ ఎమ్మెల్యే శిరీషా దేవి ఇటీవల శాసనసభలో పేర్కొనడం దారుణమన్నారు. ఇది గిరిజనులను వంచించడమే అవుతుందన్నారు. ఈ నేపథ్యంలో తక్షణమే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆమెను మన్యం నుంచి బహిష్కరించాలని స్థానిక గిరిజనులకు సూచించారు. కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి శోభన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌సీఐ అభివృద్ధికి కార్యాచరణ

ఆరిలోవ: ప్రభుత్వ ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్ (ఎఫ్‌సీఐ)లో బుధవారం సొసైటీ గవర్నర్ల బోర్డు సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సాంకేతిక విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్లు వి.పద్మారావు, సుధా సాగర్ వర్చువల్‌గా హాజరు కాగా.. ఏయూ అకడమిక్ సెనేట్ సభ్యుడు కె.కుమార్‌రాజా, ఎలిగెంట్ హోటల్ ఎండీ పవన్ కార్తీక్, ఎఫ్‌సీఐ ప్రిన్సిపల్ కె. వెంకటరమణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎఫ్‌సీఐ అభివృద్ధికి కార్యాచరణ గురించి చర్చించారు. అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, ఇతర అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మానవ వనరుల కొరత తీర్చడానికి కాంట్రాక్టు ప్రాతిపదికన అవసరమైన సిబ్బంది నియామకం, శాశ్వత భూ కేటాయింపు, అధ్యాపకుల వేతనాలు, సంస్థ ఆధునికీకరణ వంటి అంశాలపై ఉన్నతాధికారులతో చర్చించినట్లు ప్రిన్సిపాల్ కె.వెంకటరమణ తెలిపారు.



సొసైటీ గవర్నర్ల సమావేశంలో అధికారులు

ఫుడ్ కమిషన్ సభ్యురాలి సుడిగాలి పర్యటన

మహారాణిపేట: రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యురాలు గంజిమాల దేవి బుధవారం పలు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ఇసుకతోటలోని బీసీ కాలేజీ గర్ల్స్ హాస్టల్, ఎంవీపీ కాలనీలోని ఎస్టీ వెల్ఫేర్ పోస్ట్ మాట్రిక్ కాలేజీ గర్ల్స్ హాస్టల్, సోషల్ వెల్ఫేర్ బాయ్స్ హాస్టళ్లను సందర్శించారు. ఇక్కడ పలు సమస్యలు ఉన్నట్టు విద్యార్థులు సభ్యురాలి దృష్టికి తీసుకొచ్చారు. కుళాయి కనెక్షన్ ఉన్నా.. నీరు రాకపోవడంతో ఈ విషయాన్ని జాయింట్ కలెక్టర్ దృష్టికి గంజిమాల దేవి తీసుకెళ్లారు. నాతయ్యపాలెంలోని రేషన్ షాపులో పీడీఎస్ సరకులను ఆమె పరిశీలించారు. అగనంపూడి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్నం భోజనం రుచి చూశారు.



పాఠశాలలో మధ్యాహ్న భోజనాలను పరిశీలిస్తున్న సభ్యురాలు గంజిమాల దేవి

వినాయక ఆలయంలో అన్నసమారాధన

ఆరిలోవ: జీవీఎంసీ తొమ్మిదో వార్డు హనుమంతవాక రామాలయం వీధిలోని అభయ వరసిద్ధి వినాయక ఆలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. హనుమంతవాక, విశాలాక్షినగర్ ప్రాంతాల నుంచి భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. కమిటీ ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు భార్య సుజన ముఖ్య అతిథిగా స్వామిని దర్శించకొన్నారు. భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు శ్రీనివాసరెడ్డి, కల్యాణి, మంగప్రభ, వేజెల్ల సుబ్బరాజు, అప్పలరెడ్డి పాల్గొన్నారు.



అన్నప్రసాదం వడ్డిస్తున్న కమిటీ సభ్యులు

24, 25 తేదీల్లో బ్యాంకుల సమ్మె

సీతమ్మధార: యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ పిలుపు మేరకు బుధవారం ద్వారకానగర్‌లోని ఇండియన్ బ్యాంక్ జోనల్ ఆఫీస్ వద్ద ఆఫీసర్లు, క్లర్కులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ 24, 25 తేదీల్లో బ్యాంకులు సమ్మెకు వెళ్తున్నాయని తెలిపారు. ముఖ్యమైన డిమాండ్లు, ఐదు రోజుల పని దినాలు, బ్యాంకుల్లో నియామకాలు తదితర అంశాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్య నాయకులు ఆఫీసర్స్ యూనియన్ కార్యదర్శి శివప్రసాద్, అవార్డు స్టాఫ్ యూనియన్ జాయింట్ జనరల్ సెక్రటరీ బి.మహేశ్వరరావు, అధిక సంఖ్యలో బ్యాంకుల ఉద్యోగులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి సారె సమర్పణ

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు ఆరిలోవ ఆఖరి బస్ స్టాప్ దరి ఎస్‌కేఎంఎల్ నగర్‌లోని కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. స్థానికులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. ఆలయ ఆవరణలో నిర్వాహకులు కోలాటం తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరిలోవ పద్మశాలి సంఘం మహిళలు అమ్మవారికి సారె సమర్పించారు. మిఠాయిలు, పిండి వంటలు, పళ్లు తీసుకువెళ్లి నైవేద్యంగా పెట్టారు.



అమ్మవారికి నైవేద్యంగా పెట్టిన సారె